# సామరస్యం

అశోక్ మొదటి మారుగా కలుసుకునేటప్పటికే ఆమెకు వివాహంఅయి ఆఫీసులో యేడేళ్ళ 'సర్వీస్' కూడ అయింది. ఆమె అతి నాజూకుగా 'నిరాలంకారభూషిత', 'నిరాడంబరాలు'గా వుండడం అతన్ని వెంటనే ఆకర్షించింది. అతనితో మాట్లాడేటప్పుడు చాల నింపాదిగా స్పష్టంగా మాట్లాడింది. మాట్లాడుతున్నంత సేపూ ఆమె కళ్ళు 'మిలమిల' మెరుస్తూనే వున్నాయి.

ఇద్దరి మధ్య యేమో మామూలు మర్యాద మాటలు నడిచాయి. 'ఏవిషయంలో అయినా సరే, నా సహాయం కావాలంటే మీరు నిస్సంకోచంగా అడగండి. ఎలాంటి మొహమాటమూ వద్దు' అని చెప్పిందామె.

'అలాగే సుజాతా. నాకు మీసహాయం తప్పని సరిగా కావలసి వుంటుంది, థాంక్స్-' అన్నాడు అతను.

రోజులు గడిచిపోతున్నాయి. వాళ్ళు మళ్ళీ కలుసుకునే సందర్భం రావడానికి పదిహేను రోజులు పట్టింది.

ఆమె ఒక చిన్నపనిమీద అతని దగ్గరకు వెళ్ళింది. మాట్లాడవలసిన పని అయిపోయినమీదట అతనికో ఆహ్వానపత్రిక అందించి కూర్చుండిపోయింది. వాళ్ళ రెండోఅబ్బాయి పుట్టినరోజు పండుగ. సాయంత్రం ఐదుగంటలకు ఆమె ఇంట్లోనే 'టీ'. అతను ఆహ్వానపత్రికలో తేదీవంక చూచాడు. అవును-ఆ తేదీ అతనికి అనుకూలం అయినదే. 'తప్పకుండా వస్తాను' అన్నాడు ఆమెతో, దాదాపు వాగ్దానం చేస్తున్నట్లుగా మాట్లాడాడు. అంత ఖచ్చితంగా చెప్పవలసిన అవసరం లేకపోయినప్పటికీ.

కాని అనుకోకుండా ఆరోజు ఏదో ఇతర కార్యక్రమం అడ్డువచ్చింది. పుట్టినరోజు పార్టీకి వెళ్ళలేదు. అలా వెళ్ళలేక పోయినందుకు తనమీద తనకే కోపము, చికాకు కలిగినాయి, అశోక్‌కు. 'మాటయిచ్చాను, నిలబెట్టుకోలేక

పోయినాను, నన్నుగురించి సుజాత ఏమనుకుంటుందో' అని తనలో తాను వాపోయాడు. తననుగురించి సుజాత ఏమనుకుంటుందో, తను పార్టీలో లేకపోవడాన్ని ఆమె యెలా వూహిస్తుందో--యిదంతా తన ఉనికికే ముఖ్యం అయిన సూత్రాలుగా అనిపించాయి, అతనికి.

మరునాడు ఆమె కనిపించడంతోటే 'క్షమాపణ' వేడుకుంటున్న ముఖంతో యెదురు వెళ్ళాడు. 'సుజాత, మీరు నన్ను మన్నించాలి. నిన్న మీయింటికి రావడం యెంతమాత్రం కుదిరిందికాదు. తానొకటి తలిస్తే దైవం మరొకటి తలుస్తాడు-అన్నట్లు అయింది నా పని. ఎలాగయినా మీయింటికి రావాలని అనుకున్నాను. చ్-చ్- కుదరలేదు' అన్నాడు.

ఆమె 'మీకు గుర్తువుండడమే మహాభాగ్యం, పోనీలెండి. త్యాగరాజు గారు మీరు వస్తారేమోనని చాలసేపు ఎదురుచూచారు' అంది.

'క్షమించమని త్యాగరాజుగారితో కూడా చెప్పండి. వచ్చేనెల ఎప్పుడయినా వీలుచూచుకుని మీయింటికి తప్పకుండా వస్తాను' అన్నాడు అశోక్.

చెప్పిన ప్రకారం తరువాతినెల అతను వాళ్లయింటికి వెళ్లగలిగాడు.

కుర్రవాడికో బహుమానం కూడా తీసుకు వెళ్ళాడు.

అందంగా 'ప్యాక్' చేసిన బంగీని ఆ అబ్బాయికి అందించి, బూరెల్లా వున్న వాడి బుగ్గలు పుణుకుతూ 'మంచి కుర్రాడివి, రాం-నువ్వు' అన్నాడు. 'ఇలా అనేక పుట్టినరోజు పండుగలు చేసుకో' మని ఆశీర్వదించాడు. కుర్రవాడు తన సహజధోరణిలో నవ్వి ఉత్సాహంగా ఉరకలు వేశాడు.

'త్యాగరాజుగారు, మీ పెద్దఅబ్బాయి ఎక్కడ?'అనడిగాడు.

'ఆయన ఊళ్ళో లేరు. ఆఫీసు పనిమీద చిదంబరం వెళ్ళారు. శ్యాం ఇంకా బడినుండి రాలేదు' అంది ఆమె.

'ఓ ! అలాగా ! వాళ్ళను కలుసుకోలేకపోవడం నా దురదృష్టం - ' అన్నాడు.

రెండు రకాల స్వీట్లు, వేయించిన జీడిపలుకులు చిన్న పళ్లేలలో అమర్చి తీసుకు వచ్చి అతని ముందు వుంచింది. 'తీసుకోండి-' అంది వినయంగా.

'ఇప్పుడివన్నీ యెందుకండీ, లేనిపోని శ్రమ' అన్నాడు.

'ఎప్పుడయినా శ్రమ ఏమీలేదు లెండి. మీకోసం ప్రత్యేకం తయారు చేసినవి కాదు. తీసుకోండి, ఫరవాలేదు' అంది.

'నాకోసం చేసినవి కాకపోవచ్చును, కాని వీటిమీద నా పేరే వ్రాసి వుంది,' అన్నాడు.

ఆమె నవ్వింది.

అతను ఆ పళ్లేల పని పట్టిస్తూ వుండగా ఆమె లోపలి గదిలోనికి వెళ్ళింది. అతను పూర్తి చేసేటప్పటికి పొగలు కక్కుతున్న కాఫీ కప్పు అతనికి అందించింది. అలా అందిస్తున్నప్పుడు ఆమె మామూలు ప్రకారం చిరునవ్వు చిందించింది. అశోక్ ఆమెవంక పరిశీలనగా చూచాడు. చంద్ర కాంతి అప్పుడే ఆ గదిలోనికి ప్రవేశించినట్లు అనిపించింది అతనికి. ఉన్న ట్లుండి అతని మెదడుకు ఏదో విషయం స్ఫురించింది. ఆ! అదీ! ఆ చిరు నవ్వు!! అదే ఆమెను తనకు దగ్గర చేస్తోంది. దగ్గర చేయడమే కాదు, హృదయానికి చేరువ, ప్రీతిపాత్రము అవుతోంది - అనుకున్నాడు అశోక్.

అదే చిరునవ్వు.

చిరు మందహాసం.

దానిని మరచిపోవటానికి కొన్ని సంవత్సరాలు పట్టింది తనకు.

ఆమె నవ్వుతూ వున్నప్పుడు పలువరుస కొద్దిగా - ఒక్కక్షణమో అరక్షణమో - అమాయకంగా ముందుకు కనిపిస్తుంది. ఎడమ వయిపు బుగ్గ తమాషాగా ఒకపక్కకు పొంగుతుంది. దీనివల్ల ఆమెకు మరింత సౌకుమార్యం, లాలిత్యం చేకూరుతాయి.

'మీరు నవ్వే పద్ధతి నాకు ఆనందం కలిగిస్తోంది సుజాత-' అన్నాడతను, తను ఏం మాట్లాడుతున్నాడో, దాని అవసరం ఏమిటో అంతగా పట్టించుకోకుండానే.

ఈ మాటలకు ఆమె ముఖకవళికలలో ఏమయినా మార్పు వచ్చిందేమో చూద్దాం అనిపించింది అతనికి. కాని ధైర్యంగా తల పైకి ఎత్తలేకపోయినాడు. ఆమె మాత్రం నిరామయంగా నిర్లిప్తంగా తీసుకుంది అతని మాటలను.

'త్యాగరాజుగారుకూడా ఇలాగే అంటారు, మీకిద్దరికీ యీ చిరునవ్వు సంతోషదాయకం కావడం నా అదృష్టం' అంది, కృతజ్ఞతగా.

'ఎవరికయినా సంతోషదాయకమే; శుద్ధ మొద్దు అవతారం అయితే తప్ప-' అనుకున్నాడు అశోక్ తనలో తాను.

సరే, ఇక వెళ్ళిపోతే బాగుంటుంది అనుకుని ఆమె దగ్గర శెలవు తీసుకుని బయలుదేరాడు. అయితే ఇంకా కొద్దిసేపు అక్కడ గడపాలని మనసు ఊరికే ఉబలాట పడిపోయింది.

'థాంక్స్, వస్తాను' అన్నాడు. ముందుకు నడిచాడు.

'మీరు మీ భార్యగారిని కూడా తీసుకు వస్తారనుకున్నాను-' అంది ఆమె. అతనేం జవాబు చెప్పలేదు. అదో పద్ధతిగా తల ఊపి బయట పడ్డాడు.

ఇంటికి వెడుతున్నంతసేపూ ఆమెను, ఆ చిరునవ్వును యెక్కడో చూశాను, యెక్కడా అని ఆలోచించడంతోనే సరిపోయింది అతనికి.

ఆ ముఖం బాగా పరిచయం అయినది, యెక్కడో గుర్తు రావడం లేదుగాని, ఏదో తళుక్కున మెరిసినట్లు అయింది మనసుకు. ఇంటికి రావడంతోటే ఆదరాబాదరా దుస్తులు మార్చుకుని అవకాశం కోసం కూర్చున్నాడు. భార్య వంటగదిలో పనిలో ఇమిడిపోయి మరో పావుగంటదాకా పడక గది

వేపు రాదని రూఢి చేసుకున్నాక, ఇనుపబీరువా తెరిచాడు. మూడో అరలో ఒక పక్కగా వుంది భార్య తెచ్చుకున్న ఫోటో ఆల్బం.

అశోక్ గబగబ ఆల్బంలో మొదటి పేజీలు తిప్పాడు. పేజీకి సరిపడ వున్న ఫోటోలన్నీ అతన్ని ప్రేమగా పలకరిస్తున్నాయి. ఆత్రంగా తన మన సులో మెదులుతున్న ఫోటో పేజీ తీయగలిగాడు.

అవును - అదే ఫోటో.

దాన్లో వుంది సుజాత, తన భార్య లీల పక్కన చిరుమందహాసం చిందిస్తూ.

అశోక్ పరిశీలనగా చూచాడు కళ్ళు పెద్దవి చేసుకుని.

అవును! అదే మనిషి.

కాకపోతే యీ ఫోటో పదేళ్ళక్రిందటిది గనుక అప్పుడు ఆ ముఖాలు యింకా లేతగా నవనవలాడుతూ వున్నాయి. ఇప్పుడయితే గాంభీర్యం పులుము కున్నాయి, సుకుమారం పోగొట్టుకోకపోయినా.

ముత్యాల వరుసలాగ పళ్ళు కొద్దిగా బయటకు కనిపిస్తూనే వున్నాయి, యీ ఫోటోలో. ఎడమబుగ్గ పొంగి అందంగా రూపొందివుంది.

సుజాతను మొదటిమారు ఆఫీసులో కలుసుకున్నపుడే ఆమెపట్ల కొంత ఆత్మీయత అనురాగం ఎందుకు కలిగినాయో యిప్పుడు స్పష్టంగా అర్థం అయింది.

ఈ ఫోటోఆల్బం లీలది. కాపురానికివస్తూ తన 'సముదాయం'లో దీన్నికూడా తెచ్చుకుంది. అశోక్‌కు యిప్పటికిగుర్తు, లీలకు యీ ఆల్బం అంటే యెంత యిష్టమయినదో-తను దానిని చూస్తే ఆమెకు ఎంత అసూయ వస్తుందో ; మొదటిమారు తానే చూడమని యిచ్చి యిందులో యితర ఆడ వాళ్లను గురించి వివరాలు అడగడం లీల యెలా సహించలేకపోయిందో !

'చిన్నప్పటినుంచివున్న నా ఫోటోలు చూడండి. ఇతర ఫోటోల గురించి మీకు యెందుకు? మీకంటికి నా స్నేహితురాళ్ళే నాకంటే అందంగా కనిపిస్తున్నారా? నేను మీకంత అందమయినదాన్నిగా కనిపించకపోతే నన్ను యెందుకు చేసుకున్నారు యేరికోరి?' - యీ రకంగా ఒక వాక్యానికి మరో వాక్యానికి పొందికలేకుండా ప్రతీ అక్షరానికీ అసూయ, అయిష్టము వ్యక్తంచేస్తూ మాట్లాడింది అప్పుడు. తనకు యేమాత్రం యిష్టంలేనిపని చేసినప్పుడల్లా లీల ధోరణి యిలాగే వుండేది మొదట్లో, అయిదుఆరు సంవత్సరాల క్రిందటివరకూ. ఎటొచ్చీ యీ రెండుమూడేళ్లనించి కాస్త నయం, సమరసంగా మాట్లాడడం, చెప్పింది శ్రద్ధగా వినడం అలవరచుకుంది. అభిప్రాయాలను వెనువెంటనే ఖండించడం మానివేసింది.

అశోక్‌కు యిప్పుడు అనిపించింది.

అయితే లీల సుజాతకు బాగా స్నేహితురాలయివుండాలి. సుజాతను గురించి బాగా యెరిగివుండాలి లీల. ఆమెను-యే ప్రమాదానికీ దారి తీయకుండా-అడగడం ఎలా?

లీలకు యేదయినా అనుమానంగాలి తగిలిందంటే ఇంకేంలేదు, యీ కాస్తశాంతీ అంతర్ధానం అయిపోతుంది.

ఫోటోఆల్బం తెరిచిపట్టుకునే వంటగదిలోనికి వెళ్ళాడు అశోక్.

'చూడు లీలా-అలమార్లో కాగితాలు సర్దుతుంటే యీ ఆల్బం కింద పడింది. ఈ పేజీలో తెరుచుకుంది. అప్పటి నీ వాలకంచూచి ముగ్ధుడినయిపోతున్నాను, ఇందాకటినుంచి. కావాలంటే చూడు, నీ తీరు అప్పటికీ ఇప్పటికీ యెంతతేడాగా వుందో-' అన్నాడు.

లీల ఆల్బం తీసుకుని ఒక్కక్షణం చూచింది.

'ఈబొమ్మా? మా పక్కింటి అమ్మాయితో కలిసి తీయించుకున్నదిగదూ ఇది. నాకు ఇష్టంలేదు. అయినా దానిబలవంతంవల్ల ఫోటో దిగాను.

అందంగా వుంచే అమ్మా-నీ తీరు; ఆల్బంలోనుండి తీసివేయకు-అని మా అమ్మ పట్టుబట్టడంవల్ల దీన్ని వుంచాను, లేకపోతే యెప్పుడో పీకి పారేసే దాన్ని-'

'నయం. పారేశావుగాదు. అయినా యెందుకంత అయిష్టం నీకు?'

'ఆ పక్కనున్న అమ్మాయి యెవరనుకున్నారు? శూర్పణఖలాంటి చుప్పనాతి. దానిపేరు సుజాతో యేదో వుండాలి. దానికీ నాకూ పరీక్ష మార్కుల్లో యెప్పుడూ పోటీయే-'

'అలాగా? ఎప్పుడూ నీకే ఎక్కువ మార్కులు వచ్చేవనుకుంటాను-'

'ఆహా! పెళ్లయినాక మీ వాళ్లు వొప్పుకోలేదుగాని లేకపోతే ఐ. ఏ. ఎస్. కు వెళ్ళేదాన్ని కదూ?'

బండి దారితప్పుతోందని గ్రహించాడు అశోక్.

ఆల్బం తీసుకుని మూసేసి అలమారులో పెట్టేశాడు.

అతనికి టిఫిన్ అమరుస్తూ అంది లీల: 'సుజాతకు యెంత గర్వం అనుకున్నారు? హాయిగా ఉద్యోగం చేసుకుంటూ ఉండాలని నేను అంటే; కాదు, ఇంటిపట్టునే వుండి సంసారం, పిల్లలు, పెంపకం అంటూ ముసలమ్మ కబుర్లు చెప్పేది-'

అశోక్ అనాసక్తంగా అన్నట్లు వింటున్నాడు.

'ఆడవాళ్ళు ఉద్యోగాలు చేయకూడదు కాక చేయకూడదు- అని ఒకటే వాదించేది: ఇప్పుడు యెక్కడుందోగాని మహాతల్లి....' అంది లీల.

అశోక్ ఇంక ఆ ప్రస్తావన ఇష్టం లేనట్లుగా ఏదో మాటల్లోనికి మళ్ళించాడు లీల ధోరణిని.

తరువాత అశోక్ - సుజాత తరుచుగా కలుసుకుందుకు అవకాశాలు కలిగాయి.

కుడిచెవి మీదుగా అతని జుట్టు-క్రాపింగ్ జుట్టు-మెలికలు తిరిగి ఒక రకమయిన నిండుతనాన్ని కలిగించడం, సుజాతకు ఆప్యాయంగా, ఆకర్ష వంతంగా అనిపించసాగింది.

ఆడవాళ్ళు ఉద్యోగాలు చేయడం, అందులోవున్న బాదరబందీలు గురించి ప్రస్తావించుకున్నారు ఒకమారు.

'చదువుకున్నందుకు సార్థకత వుండాలిగా' అంది ఆమె.

'చక్కగా సంసారం చేసుకోవడమే సార్థకత. దాని కోసం వేరే ఉద్యోగం చేయవలసిన అవసరంలేదు' అన్నాడు అశోక్.

ఆడవాళ్ళు ఇల్లు కదిలి బయటకు వెళ్ళడం మీకు యిష్టం లేదను కుంటాను;'

'అదేంలేదు. అవసరం వస్తే ఎవరయినా ఇల్లు కదలవలసిందే. కాక పోతే ఆ 'అవసరం' నిర్ణయించడం దగ్గరే కొన్ని యిబ్బందులు నాకు.'

ఆమె నవ్వింది. ఏమీ ప్రశ్నించలేదు.

అతని భార్య చదుకున్నదేననీ ఉద్యోగం చేయకుండా ఇంటిపట్టునే విశ్రాంతిగా వుంటుందనీ ఆమెకు అప్పటికే తెలిసిపోయింది.

'ఆర్థిక అవసరాలు-వొత్తిడికి తలవొగ్గవలసిన అవసరం వున్నది నాకు, ఇంకా' అనుకున్నది సుజాత స్వగతంగా.

'ఉద్యోగం చేయడంవల్ల కొన్నిసదుపాయాలు వున్నాయి. ఈ పృథివి ఎంత విశాలమయినదో తెలిసివస్తుంది, ముందుమాటగా-' అన్నాడతను కొంత సమయం అయిన మీదట.

'బాగా ఆలోచిస్తే, ఉద్యోగంచేసే ఆడవాళ్ళు ఎటువంటి త్యాగాలు చేయవలసి వస్తుందో మీకే తెలిసివస్తుంది-' అంది ఆమె.

'త్యాగం చేయడంలో ఆనందం వుంది. ఆ మాట అలా ఉంచండి మీ త్యాగరాజుగారు యేమంటారు? అన్నాడు అశోక్, పరిశీలనగా ఆమె ముఖంలోకి చూస్తూ.

'ఏమంటారో మీకే కనిపిస్తూ వున్నదిగా-' అని ఊరుకుంది ఆమె అశోక్‌కు యేమీ అరంకాలేదు. ఇంక పొడిగించడం ఇష్టంలేక, చేతకాక, ఊరుకుండి పోయినాడు.

తరువాత ఒకరోజు ఆమె చిరునవ్వు నవ్వినప్పుడు, అశోక్ ఆమె ఎడమ బుగ్గమీద చిన్న చిటిక వేశాడు.

సుజాత ఉలిక్కి పడలేదు.

అశోక్ ఆమెకు మరింత దగ్గరగా జరుగుతూ, ఆమె చేతులు తన చేతుల్లోనికి తీసుకున్నాడు. ఆమె నింపాదిగా చేతులు విడదీసుకుంటూ అదే చిరునవ్వుతో 'నాకు ప్లేటో ఆదర్శం' అంది.

ఆమె భావాలు అతనికి ఆశ్చర్యం కలిగించలేదు.

ఆ చిరునవ్వే అతనికి యీ జవాబును చాలరోజుల కిందటనే తెలియ పరచింది.

(ఆకాశవాణి, మదరాసు కేంద్రం)